

# అతని చెల్లెలు

పాలంకి వెంకటరామచంద్ర మూర్తి

రఘుపతి ప్రసాదరావుగారితో 'నేను అమెరికాకు వెళ్లి డాక్టరేటు సంపాదించ డానికి నిశ్చయించుకున్నానండీ.' అన్నాడు.

రఘుపతి తండ్రి నారాయణమూర్తి గారు లాయరు. నారాయణమూర్తి బ్రతికిఉన్న రోజులలో ప్రసాదరావూ, ఆయనా కలిసి ప్రాక్టీసు చేసేవారు. నారాయణమూర్తిగారి భార్య ఆయన కంటే ముందే గతించింది. రఘుపతికి శ్యామల తప్ప తోబుట్టిన వాళ్లులేరు. ప్రసాదరావుగారే వాళ్ళ వ్యవహారాలు చూసిపెడుతూ చేదోడు వాదోడుగా ఉంటున్నాడు.

'అమెరికా ప్రయాణమంటే పైపైన ఉందా? పదిహేను వేలైనా కావాలి.' అన్నాడు ప్రసాదరావుగారు.

'ఆ రెండెకరాల భూమీ ఆ పాత యిల్లూ ఉండి మమ్మల్ని రక్షిస్తాయా? అవి అమ్మేసి ఆ సొమ్ముతో పి. హెచ్.డీ. డిగ్రీ సంపాదించుకుని ఇట్టే చక్కా వస్తాను; వచ్చి ఉద్యోగంచేసి పెట్టుబడి సొమ్ముకి పదిరెట్లు సంపాదిస్తాను.'

మీ చెల్లెలు శ్యామల పెళ్ళియీడు కొచ్చిన పిల్ల. నువ్వు ఎక్కడికి వెళ్లినా ఆ అమ్మాయికి పెళ్లిచేసి వెళ్లటం మంచిది.'

'దానిపెళ్ళికి తొందరేమొచ్చిందండీ? నేను డిగ్రీలతో అమెరికానుంచి తిరిగొస్తే నాకు సంపాదనతోబాటు స్టేటస్ ఎక్కువై అప్పుడు దానికి చక్కటి సంబంధాలు వస్తాయి.'

'చెల్లెల్ని ఒంటరిగా ఎక్కడుంచి వెడతావనైతే?'

'మహిళా మందిరంలో చేరుస్తాను. నేను తిరిగివచ్చేదాకా చక్కా చదువుకుంటూ ఉంటుంది.'

ఆ నిశ్చయానికొచ్చిన రఘుపతికి

తా నీయవలసిన సలహా ఇంక యేమీ లేదని తేలి ప్రసాదరావు మాటాడకుండా ఊరుకున్నాడు.

'ఆ భూమీ, ఇల్లూ అమ్మించిపెట్టాలి' అన్నాడు రఘుపతి.

'చూద్దాంలే' అన్నాడు ప్రసాదరావు.

ఆ ఉన్నదంతా అమ్ముకుంటేఆ పిల్లల గతి నేలవిడిచిన సాము ఐపోతుం దేమో అనిపించి. ప్రసాదరావు ఉపేక్షచేశాడు. అది గ్రహించి రఘుపతి ఐనకాడికి తానే అమ్మేసి, అమెరికాకు వెళ్ళేడు.

2

మహిళా మందిరం వార్డెను పేరు మోహిని. అమెరికా వెడుతూ రఘుపతి ఆవిడతో 'మా శ్యామల్ని జాగర్తగా చూడండి' అని వప్పగించి వెళ్ళేడు.

శ్యామలకు ఆటా పాటా అంటే ఇష్టం. మోహినికీ ఇష్టమే. కాని శ్యామలంటే మోహినికి అంతగా గిట్టేదికాదు. అందుకు శ్యామల చురుకుతనం, దుడుకుతనం కారణాలు.

'ఏం శ్యామలా. ఎప్పుడు చూసినా పాటేనా? చదువూ. సంధ్యా అక్కర్లేదూ?'

'సెలవురోజు కదండీ?'

'మీ అన్నగారు అమెరికా వెడుతూ నిన్ను జాగర్తగా చూడవలసిందని పరిపరివిధాల చెప్పివెళ్ళేరు.'

'మీరు జాగర్తగానేచూస్తున్నారుగా?' అంది నవ్వుతో శ్యామల.

'నువ్వు నా మాట వినటంలేదే?'

'వినకపోవడమేమిటండీ? ప్రతీ అక్షరం వినపడుతూనే ఉంది!'

దాంతో భగ్గుమంది మోహిని: 'అలాగేనా మాట్లాడడం నాతో?'

'క్షమించండి. మిస్ మోహినీ... నన్నిపుడు ఏం చెయ్యమన్నారో చెప్పండి.' అంది శ్యామల.

మోహిని విజృంభించి నిక్కచ్చిగా 'లెక్కలు చెయ్యాలి. సైన్సు చదవాలి. పరీక్షలు దగ్గిరకొస్తున్నాయి గనక ఇంక డాన్సూ సంగీతం కట్టిపెట్టాలి!' అని ఆజ్ఞాపించింది.

3

రెండు సంవత్సరాలు గడిచాయి. అమెరికాలో రఘుపతి పి. హెచ్. డీకి ఇంకా థీసేస్ రాయడం ప్రారంభించ లేదు. ఈ లోగానే అతడుకూడా పట్టుకు వెళ్ళిన సొమ్ము ఐపోయింది. ప్రసాదరావు గారికి రాస్తే, ఆయన బ్యాంకులో మిగిలిన సొమ్ముతీసి పంపేడు. పంపుతూ, 'ఇక్కడ శ్యామల చదువుకోసం కదా సొమ్ము ఉంచివెళ్ళేవు? ఈ మొత్తం నీకు పంపేస్తే ఈ అమ్మాయికి చిక్కు వస్తుందేమో?' అని సూచించాడు.

"నేనిక్కడ ఏదైన ఉద్యోగం చేసి డబ్బు సంపాదిస్తాను. అందులోంచి కొంత చెల్లాయికోసం పంపుతాను' అని రఘుపతి జవాబు రాశాడు.

కాని అతడలా పంపలేక పోయాడు. నెలనెలావచ్చి సొమ్ము ఇచ్చి యోగ క్షేమాలు కనుక్కువెళ్లే ప్రసాదరావు గారు రాకపోయే సరికి శ్యామలే వారి యింటికి వెళ్లింది.

'నేను వచ్చి చెబుదామనుకుంటోంటే నువ్వే వచ్చావు శ్యామలా ?'

'ఏం చెబుదామనుకున్నారు ? మా అన్నయ్యదగ్గిరనుంచి ఉత్తరం ఏదైనా వచ్చిందాండి ?'

ప్రసాదరావుగారు పరిస్థితులను తెలియచేశాడు. 'ఐనా నీకు ఇబ్బంది ఉండదులే. నాదగ్గిర ఏదో ఒక బాపతు సొమ్ముఉంది. అందులోంచి నీకు నెల నెలా కడుతోంటాను. రఘుపతి తన ఖర్చుకైనా అక్కడ సంపాదించుకో కలిగితే ప్రస్తుతం ఏ చింతా ఉండదు'. అన్నాడాయన.

'ఆ పరాయిదేశంలో ఏం ఇబ్బంది పడుతున్నాడో మా అన్నయ్య ?'

'ఇబ్బందే మరి. చెపితే విన్నాడు కాదు. ఈ విదేశీ చదువులకి మస్తుగా డబ్బైనా ఉండాలి;లేకపోతే ఏ స్కాలరు షిప్పైనా దొరకాలి.'

మహిళామందిరం ఆవరణ ప్రవేశి స్తోంటే శ్యామలకు మిస్ మోహిని ఎదురైంది. ఆమెతో సంగతంతా చెప్పి సలహా అడుగుదామా అనిపించింది శ్యామలకి. కాని మిస్ మోహిని, 'నాతో



"డాక్టరుగారు నాకు, ఈ బాధ పడలేక చావా లని పిస్తుందండీ !.

"మీరేం బాధ పడకండి అ విషయం నాకు వది లెయ్యండి. బిల్లు మాత్రం ముందు పంపిం చండి !"

చెప్పకుండా ఎక్కడికీ వెళ్లొస్తున్నావ్ ?' అంది రుసరుసలాడుతో.

'మీ రూముకొస్తే మీరులేరు. వాణితో చెప్పి మీకు తెలియ చెయ్య మన్నాను.'

'నాన్‌సెన్సు ! నా పర్మిషన్ లేందే నువ్వు వీధులమ్మట తిరగటానికి వీల్లేదు. నీ ప్రోగ్రెస్సు ఏమీ బాగుండలేదు. నీకు లెక్కలలో తక్కువొస్తున్నాయి ! ప్రిన్సిపాల్ తో చెప్పి నిన్ను పంపిం చేస్తాను !' అంటూ మోహిని వెళ్లి పోయింది.

మోహిని అన్నమాట నిజమే. శ్యామ లకు లెక్కలలో తక్కువే వచ్చాయి.

"నువ్వు మా కంటే తెలివైన దానివి. హోంవర్కు సరిగాచేస్తే మా కంటే ఎక్కువ మార్కులే వస్తాయి నీకు" అంటుంది వాణి. నిజమే. కాని దాన్సు క్లాసునుంచి అలిసిపోయి వచ్చే సరికి నిద్రవచ్చేసి లెక్కలు చెయ్యడం కుదర టం లేదు. ఆటాపాటా బాగావచ్చే వాళ్లకి లెక్కలలో తక్కువొచ్చినా పరవా లేదంటే బాగుండిపోను.

'అన్నయ్య వెదుతో నన్ను ఈవిడకు అప్పగించి వెళ్లేడు. నే నంటే సానుభూతి లేదు సరిగదా ఉత్తినే మండిపడుతోంది!' అనుకుంటూ శ్యామల మెట్లెక్కింది. వాణి కనపడ్డంతోనే, 'మిస్ మోహినితో చెప్పలేదా ? అని అడిగింది.

'చెప్పేను'.

'మరెందుకూ అలా మండి పడు తుంది ?'

'చెప్పనా ?'

'ఏమిటి ?'

'నీ ఆటాపాటా అందరూ మెచ్చు కుంటోన్నకొద్దీ మిస్ మోహినికి అసూయ ఎక్కువైపోతోంది !'

'మధ్య ఆవిడ కెందుకూ అసూయ?'

'తనంత గొప్ప డాన్సరు లేదని, ఆవిడకో అహంకారం ఉండేదిట. అదిప్పుడు దెబ్బతింది !'

'ఆమాటకొస్తే మిస్ మోహిని గొప్ప నర్తకే '

నిజమే అనుకో. కాని ఆవిడ నీ తర్వాతే అంటున్నారు. నీ సత్తా నీకు తెలియదుకాని నువ్వుకూడా మీ అన్న య్యతో ఆమెరికా వెళ్ళవలసింది శ్యామలా."

"నేను వెడదామనే అనుకున్నాను. కాని మా అన్నయ్య. 'పెళ్ళికి వెదుతో పిల్లిని వెంటబెట్టుకు వెళ్ళినట్టు నువు కూడా ఎందుకు ?' అనేశాడు."

"అనేశాడేకాని నువుకూడా వెళ్ళి ఉంటే హాలీవుడ్‌లో డాన్సింగంతా నేర్చుకువచ్చేసేదానివి ! దానికేంగాని ఈ పత్రిక చూశావా ? మిస్ మోహిని టేబిలుమీంచి తెచ్చాను. ఆవిడ చూడ కుండా పెట్టేసి రావాలి మళ్ళీ.' అంది వాణి.

'ఎవరిదే ఆ బొమ్మ ?'

'సినీతార కనకలతది !'

'ఎంతబాగుందో !'

'నీకంటేనా శ్యామలా ?'

'నా మొహాని కంత అదృష్టమా వాణీ ?'

'అదేమన్నమాటే ? నీ అదృష్ట మంతా నీ మొహంలోనే ఉంది' అంది వాణి. అని లేచి,

'నగలేల గిగలేల చిన్నదానా ?
నీ మొగమె నీ సొమ్ము హంసయాన !'

అంటూ దాన్సు చెయ్యడం ప్రారం భించింది.

'ఆస్టే పొగిడెయ్యకు !'

'నేను చూపించదలుచుకున్న దింతకీ ఈ ప్రకటన'. అంటూ వాణి చదివింది. 'కావలెను....చక్కని నటీనటులు కావలెను. నృత్యమూ, సంగీతమూ వగైరా వివరములను తెలుపుచూ ఫోటోలతో సహా దరఖాస్తులను పంపవలెను.' చదవడం ముగించి, 'శ్యామలా నీ ఫోటో పంపిద్దాం' అంది.

'ఎందుకూ రూపాయల దండుగ !'

'దండుగేమిటి? తమాషాకి పంపించి చూద్దాం.'

## 4

ఆదర్శ చిత్రమండలి వారి కెమేరామేను వచ్చిన ఫొటోలన్నీ పరిశీలించి. 'లావూకాదు, సన్నం కాదు. ఏ యాంగిలులో నైనా తీయొచ్చు. ఏ పోజులోనైనా బాగుంటుం దీ అమ్మాయి.' అంటూ డైరక్టరు చేతికి శ్యామల ఫొటోను అందించాడు.

'దరఖాస్తులో ఆటాపాటా నేర్చినదే అని ఉంది' అన్నాడు డైరక్టరు. అని, 'ఈఅమ్మాయి డాన్సు ఎక్కడో చూశాను' అనుకున్నాడు.

'వాణీ ! వాళ్ల దగ్గిర్నుంచి ఉత్తరం వచ్చిందే :' నా కళ్లు నేనే నమ్మలేక పోతున్నాను! ఇంటర్వ్యూకి రమ్మన్నారు' అంటూ శ్యామల ఉత్తరాన్ని చూపించింది.



"ఓ సామీ ! పరుగెత్తావా పొడిచేస్తా ! మర్యాదగా ఆ జేబులో వుండే వెండి పొడిడబ్బీ ఇలా పడేయ్ !

---

వాణి బ్రహ్మానందపడి. సంతోషం పట్టలేక శ్యామల్ని కౌగిలించుకుంది.

'ఏమిటర్రా గందరగోళం ?' — వాళ్ళు ఉలిక్కిపడి వెనక్కి తిరిగేసరికి మిస్ మోహిని మిస్ రాక్షసిలా ప్రత్యక్షమైంది !

'ఆ కాగిత మేమిటే శ్యామలా ?' అన్నది మోహిని.

వాణి చూపించవద్దంటూ సౌజ్ఞచేసింది కాని శ్యామల గమనించలేదు. ఆదర్శ చిత్రమండలివారు ఇంటర్వ్యూకి రమ్మంటూ రాశారండీ' అన్నది కాగితం అందిస్తో.

మోహిని ముఖం కాగితంలా తెల్లబడింది. 'నాకు తెలియకుండా సినిమా

వాళ్ళకి ఉత్తరాలూ దరఖాస్తులూ పంపుతున్నావా?' అంటూ ఆ ఉత్తరాన్ని చింపేసింది!

'అదేమీటి మిస్ మోహినీ. అలా చింపేశారు?' అన్నది వాణి.

'చింపుతానా, చీరేస్తానా? ఇలాంటి పరువుతక్కువ పనులు చేసినందుకు బైటికి గెంటెయ్యాలి!'


వాణికి ఒళ్ళు మండిపోయింది. 'మిస్ మోహినీ. ఐతే మిమ్మల్నికూడా బైటికి గెంటివేయవలసిందే!' అన్నది.

మోహిని నిర్ఘాంతపోయింది.

'ఈ ఫిలింకపెనీకి మీరుకూడా దరఖాస్తు పెట్టేరన్న సంగతి మాకు తెలీదనా?' అన్నది వాణి.

మోహిని గతుక్కుమంది.

"ఆ ఫోటోగ్రాఫరు చెప్పేడు. 'మా శ్యామల ఫొటోను ఫిలిం కంపెనీకి పంపుతున్నాం. బాగా తియ్యాలోయ్' అన్నప్పుడాతడు, 'ఫస్టుగా తీస్తానమ్మా. మీకు



సందేహంగా ఉంటే ఈఫొటో చూడండి. దీన్నికూడా ఫిలిం కంపెనీకి పంపడానికే తీయించుకున్నారు.' అంటూ మీ ఫొటో చూపించాడు !" అన్నది వాణి.

మిస్ మోహినికి గంగవెఱ్ఱులెత్తి, 'అంతా అబద్ధం! పిన్నా పెద్దా తారతమ్యం లేకుండా మాట్లాడుతున్నావు. వాణీ నువ్వు! ఈ శ్యామల స్నేహంవల్లనువు కూడా పాడైపోతున్నావు ! రిజష్టరులో మీ ఇద్దరి పేర్లూ. కొట్టేసి బయటకు నెట్టేస్తాను జాగ్రత్త !' అన్నది.

శ్యామల, 'నే నెలాగా ఈ మందిరం వదలి వెళ్లిపోతాను. వాణిమీద కోపగించ కండి' అన్నది.

'ఏమిటీ ? నువ్వెక్కడికీ వెళ్లటానికి వీల్లేదు! మీ అన్నగారు నిన్ను నా అధీనంలో పెట్టి వెళ్లేడు ! ఆయన అనుమతి లేందే నువ్వు ఇక్కడనుంచి బయటకు అడుగు పెట్టడానికి వీల్లేదు !'

శ్యామలకు నవ్వు వచ్చింది. ఓ చెంప నుంచి 'నెట్టేస్తా'నంటూ, మళ్లీ వెంటనే 'బయటకు అడుగుపెట్టడానికి వీల్లేదంటా రేమిటి మిస్ మోహినీ ?'

మిస్ మోహిని కింక నోరు పెగల్లేదు.

5

అమెరికాలో తన ఆర్థిక సమస్యకు పరిష్కారమార్గం లభించక తికమకలు పడుతోన్న రఘుపతికి మోహినివద్ద నుండి జాబువచ్చింది.

'శ్యామల సినీమాలలో చేరి భ్రష్టై పోతోంది' — అదీ ఆ ఉత్తరంలోని సారాంశం.

అతడు కంగారుపడి శ్యామలకో ఉత్తరం, ప్రసాదరావుగారికో ఉత్తరం రాశాడు.

'నా పరువూ ప్రతిష్ఠా గంగలో కలిపెయ్యకు !' అని రాశాడు శ్యామలకు. 'మీరుండికూడా దానికి బుద్ధి చెప్పొద్దా? అది సినిమాలో చేరుతోంటే చూస్తూ ఊరుకున్నారా ?' అన్న నిష్ఠూరం వేశాడు ప్రసాదరావుగారిపైన.

శ్యామల దగ్గిరనుంచీ ప్రసాదరావు గారివద్దనుండీ జవాబులు వచ్చాయి. 'పరిస్థితులు వాటంతటవి అలా తోసుకొస్తే కాంట్రాక్టులమీద చేవ్రాళ్లు చేశాను. ఇప్పుడు విరమించుకోడం మర్యాద కాదు. నీకు ఇష్టంలేదని తేలింది గనుక కొత్తపిక్చర్లలో కాంట్రాక్టులు తీసుకోను.' అని హామీ ఇచ్చింది శ్యామల.

సినిమాకంపెనీలవాళ్ళు మీ శ్యామల పెట్టిన షరతులన్నింటికీ ఒప్పుకున్నారు. కంట్రాక్టులపైన సంతకాలుచేసి, పిక్చర్లు తీయడం ప్రారంభమయాక మధ్యలో మానేస్తే చట్టరీత్యా కొన్ని చిక్కులున్నాయి. ఆమెనుగురించి నువ్వేమీ చింతపడకు. ఆమె నీ గౌరవానికి ఏమీ భంగం కలుగనివ్వదు.' అని రాశాడు ప్రసాదరావుగారు.

తన ఉత్తరం చూసికూడా శ్యామల సినిమాలు వదులుకుంది కాదనీ, ప్రసాదరావుగారు మానిపించాడు కాదనీ రఘుపతికి కోపం ఎక్కువైందేకాని ఆ పరిస్థితికి తానుకూడా కారకుడన్న సంగతి ఆతనికి తోచిందేకాదు. 'శ్యామల పెళ్ళియీడుకొచ్చిన పిల్ల. నువ్వు ఎక్కడికి వెళ్ళినా ఆ అమ్మాయికి పెళ్ళిచేసి ఓ యింటిదాన్నిచేసి వెళ్ళటం మంచిది' అన్న ప్రసాదరావుగారి మాటలైనా జ్ఞాపకానికి రాలేదతనికి. 'నీవు నా చెల్లెలివి కావు! ఇంక నేను నీ ముఖం చూడను!' అని రాసేశాడు శ్యామలకు.

చికాగో నగరంలో చిన్నచిన్న ఉద్యోగాలు దొరకడం కష్టంకాదు. కాని అలాంటి వాటిల్లో చేరితే ఆదాయం తక్కువా పని ఎక్కువా ఐ, తన 'థీసేస్సు' పూర్తికావడమంటూ ఉండదు.

రఘుపతి సమస్య, మిత్రుడు అజిత్‌రాయ్‌ని ఎక్కువగా బాధించింది. అజిత్‌రాయ్ తనకు ఇంటినుండి వచ్చేసొమ్ము లోంచి కొంత రఘుపతికి ఇస్తూవచ్చాడు కాని ఒకరికి సరిపడే సొమ్ముతో ఇద్దరికి గడవడం కష్టమనిపించింది త్వరలోనే.

రఘుపతికి తెలవకుండా అజిత్‌రాయ్ ప్రసాదరావుగారికి కేబుల్ ఇచ్చాడు.

రఘుపతికి సొమ్మువచ్చింది. 'నీకేదో వారసత్వం ఒకటి కలిసింది. ముందు ఇంకా పంపుతాను.' అని రాశారు ప్రసాదరావుగారు.



"ఇదుగో మానేజర్ వారం రోజులలోపల నా జీతం పెంచకపోతే నీ బుర్ర రాంకీర్తన పాడిస్తాను."

6

అనతికాలంలో శ్యామల 'గొప్ప తార!' అనిపించుకుంది.

ఆమెకు కీర్తితో బాటు ఔదార్యం ఎక్కువైంది.

'నమస్తే శ్యామలాదేవిగారు. వరద బాధితుల సహాయార్థం నిధివసూలు చేస్తున్నామండి. తమరొక డాన్సు పెర్ఫారమెన్సు ఇవ్వాలి.'

'ఎప్పుడివ్వాలంటారు?'

'వచ్చే శనివారం వీలుగా ఉంటుందాండి?'

"ఆవేళ 'భువనైక సుందరి'లో షూటింగు ఉన్నదండీ. ఆదివారమైతే ఖాళీగా ఉంటుంది."

థ్యాంక్సు. సెలవు తీసుకుంటాము.'

క్షామపీడితులకోసం, వరదబాధితుల నిమిత్తం, పాఠశాలల స్థాపనకొరకు ఆమె ఇచ్చిన ప్రదర్శనాల కన్నింటికీ వేలాది సొమ్ము వసూలైంది. ఆమె ఔదార్యంతోపాటు కీర్తి పెరిగింది.

'వాణీ విద్యాలయం శక్రటరీనండి నేను. 25 వ తేదీని మా స్కూలు వార్షికోత్సవం జరుపుదామనుకుంటున్నాము. ఆనాడు మీరు బహుమతీ ప్రదానానికి అనుమతించాలి.'

'నాకు 28 వరకూ తీరికఉండదండీ.'

'ఐతే 28 నే ఏర్పాటు చేస్తామండి.'

'సరే ఐతే.'

'నీ ఖ్యాతి వెలుగులా వ్యాపిస్తోంది శ్యామలా. నాకు చాలా సంతోషంగా ఉంది!' అని హృదయపూర్వకంగా అభినందించాడు ప్రసాదరావుగారు.

శ్యామల, "'నా' అన్నవాళ్ల మెప్పు లేకపోయాక ఏం లాభమండి?" అని నిట్టూర్చింది.

7

రఘుపతికి వారసత్వం ధర్మమా అంటూ ఆర్థిక చింతపోయి అమెరికాలో అతని థీసిస్సు పూర్తియై డాక్టరేటు వచ్చింది. 'మహాప్రతిభా వంతుడ'న్న యోగ్యతా పత్రాలు వచ్చాయి.

అతనికి భారత ప్రభుత్వం పెద్ద ఉద్యోగమిచ్చింది. బొంబాయిలో విమానం దిగి తిన్నగా ఢిల్లీ వెళ్లి ఉద్యోగంలో చేరేడు.

చెన్నపట్టణంలో ప్రసాదరావుగారు ఆ సంగతిని పేపర్లో చదివి శ్యామలకు తెలియచేశాడు.

'మీకైనా జాబు రాయలేదా, అన్నయ్యా?'

'మెల్లిగా రాద్దామని అనుకుని ఉంటాడు.'

దరిమిలానకూడా ప్రసాదరావుగారికి జాబేమీ రాలేదు. ఒకనాడు డాక్టరు రఘుపతే టాక్సీలో వారి యింటిముందు దిగేడు.

'అరె! వస్తున్నానని టెలిగ్రామైనా ఇచ్చావుకాదేమిటి? ఉండు శ్యామలకు టెలిఫోన్ చేస్తాను. నిన్ను చూడాలని కన్నులు కాయలు కాచాయంటోంది పాపం!' అన్నాడు ప్రసాదరావు.

'నో! వద్దు. క్షమించాలి. దానిమాట తలపెట్టకండి!'

'అదేమిటోయ్?' అంటూ ప్రసాదరావు నిర్ఘాంతపోయాడు.

'ఏనాడో అది నా చెల్లెలు కాదని తేల్చేసుకున్నాను.'

'చూడూ' అని ప్రసాదరావేదో చెప్పబోయాడు.

రఘుపతి అడ్డువచ్చి, 'నేను మిమ్మల్ని చూద్దామనే వచ్చాను. నేను విదేశంలో

ఉండగా నా వ్యవహారాలన్నీ చక్కబెట్టి ఎప్పటి కప్పుడు సొమ్ము పంపించారు. అందుకు నేను కృతజ్ఞుణ్ణి, ఆ వారసత్వం బాపతు సొమ్ము ఏమైనా మిగిలితే నేను అజిత్‌రాయ్‌కి పంపాలి—'

'ఏ వారసత్వం ?'

'నాకేదో వారసత్వం వచ్చిందని రాశారుకాదూ ?'

అదా? తర్వాత మాటాడుకుందాంలే.'

'నేను ఇవాళే ఎక్స్‌ప్రెస్సులో హైదరాబాదు వెళ్లాలి. అక్కడ ప్లానింగు మినిష్టరుతో కొన్ని సంప్రదింపులు చెయ్యాలి.'

'హైదరాబాదుకి నేనూ వస్తున్నాను.'

*8*

రైల్లో రఘుపతి ప్రసాదరావుగారితో ముచ్చటిస్తూ, 'అమెరికా అన్నిరంగాల్లోనూ ఔన్నత్యాన్ని సంపాదించిందండీ' అన్నాడు.

'సినిమారంగంలోకూడా ?' అన్నాడు ప్రసాదరావు.

రఘుపతి అనుమానిస్తూ, 'సినిమా ప్రసక్తి తెచ్చారెందుకూ ?' అన్నాడు.

ప్రసాదరావు నవ్వుతో, నీకు సినిమా రంగం అంటే గిట్టదు' కనుక ?.... దానికేంలే. సికింద్రాబాదు స్టేషను దగ్గిర పడుతోంది. బెడ్డింగు కట్టేదాం ఇంక.'

'ప్లానింగ్ సెక్రటరీ రిసీవ్ చేసుకోడానికి వస్తాడు.'

'ఎవడో పూలమాలపట్టుకొస్తున్నాడు. ఆయనే అయియుంటాడు.'

'ఆ ఒక్కడేకాదు. చాలామంది తెచ్చారే దండలు ! ఎవరికోసం చెప్మా ఇవన్నీని ?'

'నీకోసమే ! సామాన్యుడవా? కేంద్ర ప్రభుత్వంలో గొప్ప ఉద్యోగివి !'

రఘుపతీ, ప్రసాదరావుగారూ ఉన్న మొదటితరగతి పెట్టెలోకి ఒక యువకుడు తొంగిచూచి. 'ఆమె ఇక్కడ లేదు.' అన్నాడు. ఒక స్త్రీ కంఠం. 'ఫస్టుక్లాసు పెట్టెలు ఆ కొసనున్నాయి. అటు పదండి' అన్నది.

ఆ వైపునుండి 'భువనైక సుందరీకీ జై. భువనైక సుందరీకి జై !' అన్న ధ్వానాలు వినపడ్డాయి.

'భువనైక సుందరి ఎవరండీ?' అని అడిగేడు రఘుపతి.

"ఒక పిక్చరులో కథానాయక పేరది. ఆ పాత్ర నిర్వహించిన తార తలితండ్రులు పెట్టిన పేరు వేరే ఉన్నా ఈ జనమంతా 'భువనైక సుందరి' అనే స్వాగతం ఇస్తున్నారు."

ప్రతీవాడూ ఓ దండ తెచ్చాడే ! ఆవిడకోసమేనా ?'

'నీకోసం కాదని తేలిపోయింది గనక మరింక ఆవిడకోసమే అనుకోవాలి.'

రఘుపతి చిన్నబుచ్చుకున్నాడు. 'నన్ను ఎగతాళి చేస్తున్నారెందుకు ?'

'ఎగతాళికాదు రఘుపతీ. చూడు, ప్లాటుఫారమంతా జనంతో ఎలా క్రిక్కి

రిసి పోయిందోను ! ఇంతమంది ఇచ్చే స్వాగతం స్వీకరిస్తోన్న ఆ తార ఎవరో తెలుసా ? దిగిరా, ఒక్కసారి.'

'శ్యామలాదేవికీ జై ! శ్యామసుందరికీ జై !! భువనైక సుందరికీ జై !!!' అన్న కేకలు మిన్నుముట్టాయి.

రఘుపతి చిత్తరువులా రెప్పపాటు లేకుండా చూశాడు. 'ఎవరూ, మా శ్యామలేనా ? మా చెల్లెలు !'

ఔను రఘుపతీ, నీ చెల్లెలే. ఈ భువనైక సుందరి, తారామండలంలో అగ్ర తాంబూలం అందుకుని, ఆంధ్రుల, భారతీయుల, అభిమానాన్ని చూరగొన్న ఈ కళాకలశం — నీ చెల్లెలు అని చెప్పుకోడానికి సిగ్గుపడాలో లేక గర్వించాలో నిర్ణయించు....రఘుపతీ, శ్యామల నన్ను సంరక్షకుడుగానూ కార్యదర్శిగానూ నియమించుకుంది. ఈమె జమాఖర్చులన్నీ నా చేతిమీదుగా జరిగేయి. వేలు ఆర్జించింది. చేతికి ఎముక లేనట్టుగా దానంచేసింది. నువ్వు అమెరికాలో చిక్కుపడుతోంటే నీకు సొమ్ము ఎక్కణ్ణుంచి వచ్చిందని !—'

అభినేత్రి శ్యామలకూ జై! శ్యామలా దేవికీ జై !! భువనైకసుందరికీ జై !!!'

మీ చెల్లెలు నటించిన భువనైక సుందరి చిత్రానికి నేడు ఈ నగరంలో శతదినోత్సవం జరుగుతోంది. అందుకే ఈమెను ఇక్కడకు రప్పించారు.... ఎంతో ఉత్సాహంగా ఉండవలసిన శ్యామల అదోలాగ ఉంది చూశావా ? అమెరికానుండి తిరిగివచ్చాక కూడా నువ్వామెను చూడటానికి రాలేదని బాధపడుతోంది. నువ్వు మద్రాసు వచ్చికూడా ఆమెను చూడనన్నావు !'

పూలమాలతో ఉక్కిరి బిక్కిరి ఔతోన్న శ్యామల ప్రసాదరావుగారింకా రాలేదేమని ప్లాటుఫారంమీదకు దృష్టి సారించేసరికి, రఘుపతి కనపడ్డాడు. ఆమె 'అన్నయ్యా, నువ్వేనా ?' అంటూ పరుగెత్తి వెళ్ళింది.

అన్నగారే ఐవుంటాడు. పోలికలు కనపట్టంలేదూ ? అకస్మికంగా కలుసుకున్నట్టున్నారు. కన్నీరు జలజలా ఎలా రాలుతోందో!'అనుకున్నారు ప్రేక్షకులు.

ఆమె సంబరపడుతూ,మా అన్నయ్యేనండీ. అమెరికా వెళ్ళి పెద్దపరీక్షలు ప్యాసైవచ్చాడు !' అన్నది.

శతదినోత్సవ సభ ముగిశాక రఘుపతి, 'చెల్లాయ్, నేను అమెరికావెళ్ళడం ఒకందుకు మంచిదే ఐంది.' అన్నాడు.

'నేను ఇక్కడే ఉండిపోయిన సందర్భంలో నీకీ అఖండఖ్యాతి లభించి ఉండేదికాదు !' అన్నాడు.

'అన్నయ్యా, నువ్వు నన్ను మెచ్చుకుంటున్నావన్నమాట ! నన్ను క్షమించావన్నమాట !'

'చెల్లాయ్, నీవే నన్ను క్షమించాలి.'